క్లుప్తంగా

ఐఎంఏ నూతన కార్యవర్గం


డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం

మచిలీపట్నంటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మచిలీపట్నం శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. స్థానిక ఐఎంఏ హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024– 2025 సంవత్సరానికి ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ కె.వి శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బి.కేశవకృష్ణ, డాక్టర్ కె. ఫణి కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారిగా డాక్టర్ ఎస్.గిరీష్‌లను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా వైద్యులు కె. పూర్ణచంద్రరావు, బి.ప్రభురామ్, బదరీనాథ్, వి.వంశీకృష్ణ, డి.సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఐఎంఏ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బి.శ్రీనివాసచార్య వ్యవహరించారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల పారిశుధ్య సేవలు



రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెం గ్రంథాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదివారం శుభ్రం చేశారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలను షెల్ఫ్‌లో క్రమబద్ధీకరించడంతో పాటు పరిసర ప్రాంతాన్ని శుభ్రపరిచారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బొందలపాటి సుబ్బారావు, గ్రంథాలయ అధికారి సుదీర్ కుమార్, జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తజన కోలాహలం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండాయి. ఆలయం వెలుపుల ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. శ్రీసుబ్రహ్మణ్యషష్ఠి కావడంతో పెదఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు. నాగమల్లి వృక్షం, నాగపుట్ట, పొంగళిశాలల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పైడమ్మ జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

పెడన: స్థానిక శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల వాల్‌పోస్టర్లను ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆవిష్కరించారు. పట్టణంలోని బంటుమిల్లి రోడ్డులో టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీవిజయానంద డిగ్రీ కళాశాల యాజమాన్యం వాల్‌పోస్టర్లను ముద్రించి దేవదాయ శాఖకు అందజేయగా ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో శ్రీవిజయానంద డిగ్రీ కళాశాల యాజమాన్యం పిచ్చుక కోటేశ్వరరావు, దేవదాయశాఖ ఈవో టీవీవీ మోహనరావు, రామారావు, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జలధీశ్వరస్వామిని దర్శించుకున్న డీఈఓ



ఘంటసాల: స్థానిక బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామిని డీఈవో జేవీ రామారావు కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించుకున్నారు. అర్చకుడు చావలి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయులు పోతన లక్ష్మీశ్వరరావు గీసిన చిత్రాన్ని సీఆర్పీ సీత చేతుల మీదగా డీఈఓ రామారావుకు అందించారు. స్వయంగా తన చిత్రాన్ని గీసిన లక్ష్మీశ్వరరావును డీఈఓ అభినందించారు.

సర్వేకు సహకరించాలి

నాగాయలంక: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వే(ఎంఎస్ఎంఈ) కొనసాగుతుందని స్థానిక గ్రామ కార్యదర్శి జేహెచ్‌వీ పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సర్వే కోసం తిరుగుతున్నారని వ్యాపారులు, సేవాసెక్టార్ వారు సంబంధిత ధ్రువపత్రాలతో సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ వివరాలతో నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆశయానికి దూరంగా అగ్రిల్యాబ్

- పెడనలో పనిచేయని అగ్రిల్యాబ్
- క్షేత్రస్థాయి పరీక్షలకు తిలోదకాలు
- ఎరువులు, మట్టి పరీక్షలు మచిలీపట్నం ల్యాబ్‌కు..
- లక్ష్యానికి దూరంగా గత ప్రభుత్వ ఆశయం


పెడన ఏఎంసీలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్, పశుసంవర్థక శాఖ ల్యాబ్

పెడన: రైతుల సంక్షేమమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాబ్‌లు ప్రస్తుత ప్రభుత్వ తీరు కారణంగా నిర్వీర్యమవుతున్నాయి. రైతులకు, పాడి రైతులకు అందుబాటులో ఉండేలా నియోజకవర్గంలో ఒక వైఎస్సార్ అగ్రి ల్యాబ్, పశుసంవర్థక శాఖ ల్యాబ్‌లను కలిపి ఒకే చోట ఏర్పాటు చేశారు. వీటిలో పరీక్షల నిర్వహణకు పరికరాలను, సిబ్బందిని ఏర్పాటు చేశారు.

సమస్యలు ఇవీ..

ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు ఉద్యోగులు బదిలీల ప్రక్రియలో భాగంగా అగ్రి ల్యాబ్ నుంచి సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈవో, సహాయకుడిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నత చదువుల నిమిత్తం దీర్ఘకాల సెలవులో ఉన్నారు. దీంతో పెడన అగ్రి ల్యాబ్ బాధ్యతలను ఏఈవో లక్ష్మణరావుకు అప్పగించారు. అయితే అప్పటికే సదరు ఏఈవోకు మడక, లంకలకలువగుంట గ్రామాలకు సంబంధించి వీలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ బాధ్యతలను అప్పగించి ఉండటంతో ఏదైనా ఒకటే ఇవ్వాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా విన్నవించారని తెలుస్తోంది.

మచిలీపట్నం ల్యాబ్‌కు సిఫారసు..

అయితే అటు నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో పాటు పెడన మార్కెట్ యార్డులో ఉన్న అగ్రి ల్యాబ్‌కు ఇటు రసాయన ఎరువులకు సంబంధించి ఫెర్టిలైజర్ దుకాణాల వారు పరీక్షలకు పంపించి నమూనాలు, రైతులకు సంబంధించి మట్టి పరీక్షలు చేయాల్సినవి వచ్చి ఉండటం, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఒత్తిడి ఎక్కువైంది. స్థానిక వ్యవసాయశాఖా సిబ్బంది ఈ ఒత్తిడి తట్టుకోలేక పెడన ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం వచ్చినవాటిని వచ్చినట్లుగా మచిలీపట్నం అగ్రి ల్యాబ్‌కు పంపించేస్తున్నారు.

సిబ్బంది లేక ల్యాబ్ మూత..

పరీక్షలకు సంబంధించి అన్ని రకాల పరికరాలున్నా సిబ్బంది కొరత కారణం చూపుతూ అగ్రి ల్యాబ్‌ను మూసి ఉంచుతున్నారు. దీంతో రైతులు, ఫెర్టిలైజర్ దుకాణాల వారు వస్తున్నా ఎవరూ కూడా ఉండని పరిస్థితి. ఈ విషయాన్ని వ్యవసాయశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్దామంటే వారు కూడా కార్యాలయంలో రోజుకొక వీఏఏ ఉంటున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..

ఏవో వస్తున్నారో రారో కూడా తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా మీ ఏవో ఫోన్‌లో కూడా దొరకడం లేదని పేర్కొవడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అగ్రి ల్యాబ్ పనిచేసేలా సిబ్బందిని నియమించి రైతులకు సేవలందించిలే చూడాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు.

పనిచేసేలా చూడాలి..



ల్యాబ్ పనిచేసేలా చూడాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. రైతులకు సేవలను చేరువ చేసేందుకు మట్టి పరీక్షలు, విత్తనాలు పరీక్షలు అందుబాటులో ఉండేలా వైఎస్సార్ అగ్రిల్యాబ్‌లను నిర్మించింది. ఉన్నత లక్ష్యాలతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చిన వాటిని ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రైతులకు అందించే సేవలకు బ్రేక్ పడకూడదు. ప్రస్తుతం పెడన అగ్రి ల్యాబ్ నియోజకవర్గం అంతటికి ఉపయోగం.

– కాగిత వెంకటేశ్వరరావు, రైతు, కూడూరు, పెడన మండలం

ఎవరూ ఉంటం లేదు..



ల్యాబ్‌తో నియోజకవర్గ రైతులకు ఎంతో మేలు. మట్టి పరీక్షలకు ల్యాబ్‌కు వెళ్లితే ఎవరూ ఉండటం లేదు. మట్టి పరీక్షలు చేయడం వల్ల రైతు తాను పండించే పంట నేల సారవంతంగా ఉందా, దిగుబడులు వస్తాయా రావా అనే విషయం తెలుస్తుంది. సార్వా, దాళ్వా పంటలకు ముందు ఈ పరీక్షలు చేస్తారు. ప్రస్తుతం దాళ్వా లేదు కాబట్టి చాలా మంది రైతులు ఆరుతడి పంటలు వేస్తున్నారు. ల్యాబ్‌ను రన్నింగ్‌లోకి తీసుకువచ్చి రైతులకు ఉపయోగపడేలా చూడాలి.

– గరికపాటి వెంకటరామానాయుడు, రైతు, పెనుమల్లి, పెడన మండలం

పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత

- మండలంలో సమస్యలపై నిఘా కరువు
- ఎస్‌ఐతో కలిపి మొత్తం 28 మంది సిబ్బంది ఉండాలి
- ప్రస్తుతం పనిచేస్తుంది 10 మందే



నాగాయలంక పోలీస్ స్టేషన్

నాగాయలంక: అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక మండలం. ఈ మండలంలో 22 గ్రామ పంచాయతీలు, రెండు దీవులు ఉన్నాయి. సముద్రతీరంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన మండలం ఇది. ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో ఉండాల్సినంత సిబ్బంది లేక వెలవెల బోతోంది. వారం కిందట జిల్లా ఎస్పీ కొత్త డీఓ (డ్యూటీ ఆర్డర్)లు వేసినప్పటికీ నాగాయలంక పోలీస్‌స్టేషన్‌కు పరిస్థితిలో మార్పు లేదు. ఈ స్టేషన్‌లో ఎస్‌ఐతో కలిపి 28 మంది స్టాఫ్ ఉండాలి. అయితే కేవలం పది మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వీరిలో ముగ్గురు మహిళా పోలీసులు, ముగ్గురు స్టేషన్ ఆఫీసు డ్యూటీల్లో ఉంటారు. ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, మరో ఇద్దరు కానిస్టేబుల్స్ మాత్రం విధుల్లో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇద్దరు ఏఎస్‌ఐ లకుగాను ఒకరు విధుల్లో ఉండగా, మరొకరు ట్రైనింగ్‌లో ఉన్నారని చెబుతున్నారు. ఐదుగురు హెడ్‌కానిస్టేబుల్స్ స్థానంలో ప్రస్తుతం ఎవరూ లేరు. పీసీలు ఏడుగురు బదిలీపై వెళ్లారు. ఇక్కడికి ఏడుగురు రాగా వీరిలో ఆరుగురు సీఐ, డీఎస్పీ, మోపిదేవి స్టేషన్లలో డ్యూటీలు చేస్తున్నారు. ఇక్కడి ఓ కానిస్టేబుల్ ప్రత్యేక అనుమతులతో హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్ విధుల్లో ఉండటం విశేషం. స్టేషన్‌లో రైటర్, క్లరికల్, టెక్నికల్, కోర్టు డ్యూటీలు చేసేవారు ఉన్నారు. మండలంలో గ్రామాలపై దృష్టి పెట్టి తిరిగేవారు కరువయ్యారు. ప్రధాన రహదారిపై వ్యాపారులు పోటీపడి రహదారిపై సగం వరకు వచ్చినా పట్టించుకునే వారు కనిపించడంలేదనే విమర్శలూ వస్తున్నాయి. స్టాఫ్ లేక ఇబ్బందులు ఎలా అధిగమిస్తున్నారని స్థానిక ఎస్‌ఐ కలిదిండి రాజేష్‌ను అడగ్గా.. ప్రస్తుతం సమస్య ఉన్నా డీఓలలో ఇంకా రావల్సిన వారు ఉన్నారని తెలిపారు.

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలి


వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గీతాపారాయణం చేస్తున్న భక్తులు

నిమ్మకూరు(పామర్రు): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని నిమ్మకూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే దంపతులు సందర్శించారు. ఆలయంలో ఎమ్మెల్యే విశేష పూజలను చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో మచిలీపట్నం జొన్నలగడ్డ మాధవి ఆధ్వర్యంలో శ్రీ దత్త కృష్ణ గీతా పారాయణ బృందం నిర్వహించిన గీతాపారాయణ బాగుందన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకుడు ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి సంబరాలకు పోటెత్తిన భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఆలయంలోని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి స్వామి కల్యాణ రథయాత్ర నిర్వహిస్తామని సహాయ కమిషనర్ తెలిపారు. స్వామివారిని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు సహాయ కమిషనర్ ఆర్ గంగా శ్రీదేవి స్వామివారి చిత్రపటం అందజేసి సత్కరించారు.


స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

అవగాహనతో అధిక దిగుబడులు

కృత్తివెన్ను: తీరప్రాంతమైన పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలలో అధిక శాతం చౌడు భూములే ఉన్నాయి. మినుముకు ఈ భూమలు అంతగా సహకరించవని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. అయినా తప్పని పరిస్థితుల్లో మినుము సాగును చేపట్టారు. మినుము సాగులో కీలకమైన విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సలహాలిస్తున్నారు. రైతులు ఏ రకం మినుములైనా ముందుగా విత్తన శుద్ధి చేసుకోవాలి. దీని వల్ల పంటకు భవిష్యత్తులో ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు సోకవు. తెగుళ్ల సోకకుండా మ్యాంకోజెబ్ మందును కేజీ విత్తనాలకు 2.5 గ్రాములు కలిపి రెండు గంటల పాటు నిల్వ ఉంచి, తర్వాత ఇమిడాక్లోప్రైడ్ కేజీ విత్తనాలకు 5 ఎంఎల్ కలిపి రాత్రంతా ఉంచి ఉదయం చల్లుకోవాలి.

శాస్త్రీయ పద్ధతి అనుసరించాలి..

ప్రస్తుతం రెండో పంటలో అపరాల సాగులో రైతులు మినుము పంటను సాగు చేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. విత్తనశుద్ధి కీలకం. కలుపు నివారణకు మందులు ఉన్నాయి వాటిని కూడా ఉపయోగించుకోవచ్చు. సాగులో ఏ సలహాలు కావాలన్నా ఆర్‌ఎస్‌కేలో అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఉన్నారు. నేను కూడా అందుబాటులో ఉంటా.

– ఎస్.జెన్నీ, ఎంఏవో, కృత్తివెన్ను మండలం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

పమిడిముక్కల: మండలంలోని తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1982–83, 1991–92కు సంబంధించి 10వ తరగతి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, గత స్మృతులను నెమరు వేసుకుంటూ, తరగతి గదుల్లో కలియ తిరుగుతూ ఆనందోత్సాహాలతో గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. వచ్చే ఏడాది జనవరి 12వ తేదీన జరిగే పాఠశాల శతాబ్ది వేడుకల్లో పూర్వ విద్యార్థులంతా పాల్గొని జయప్రదం చేయాలని శతాబ్ది ఉత్సవ కమిటీ కార్యదర్శి యేనుగ మస్తాన్ రావు కోరారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: ఆలయాల పరిరక్షణ కోసం విశ్వ హిందూ పరిషత్ నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విజయవాడ ప్రముఖ్ పాకాల త్రినాథ్ అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఆదివారం ఉపద్రష్ట సత్రం నందు బహిరంగ సభల బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన కేసరపల్లిలో విశ్వ హిందూ పరిషత్ మహాసభను నిర్వహిస్తున్నారన్నారు. హిందూ ఆలయాల పరిరక్షణ, హైందవ సంస్కృతి, సంప్రదాయాల కొనసాగింపు ముఖ్య ఉద్దేశంగా నిర్వహిస్తున్న ఈ సభలో హిందువులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ గుడివాడ అధ్యక్షురాలు జేవీవీ కుమారి, శ్రీదేవి, పి.రవికుమార్, కె.శ్యామ్‌సుందర్, ఎం.శ్రీధర్, వై.అర్జున్, అంగడాల సతీష్, సానా వాసు, సూరే గాంధి, భవాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న విశ్వ హిందూ పరిషత్ నాయకులు

కమ్ముతున్న మబ్బులు.. రైతుల్లో గుబులు


యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


పటాన్‌పేటలో రోడ్డుపక్కన రవాణా చేసేందుకు సిద్ధంగా ధాన్యం బస్తాలు


గూడూరు సాగిరం చెరువు దగ్గర ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న కూలీలు

గూడూరు: పంట చేతికొచ్చే సమయంలో మారుతున్న వాతావరణం రైతులను కలవరపెడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన భారీ వర్షాలను తట్టుకుని ముందుకు సాగిన అన్నదాత దిగుబడి చేతికి వచ్చే సమయంలో మరింత దిగాలు చెందుతున్నాడు. కూటమి పాలకుల తీరుతో కష్టం అంతా నీటి పాలవుతోందని కర్షకులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. గూడూరు మండలంలో ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలు సాగుతుండగా కోసిన పంట పనల దశలో ఉంది. యంత్రాల సహాయంతో పంట కోసిన రైతులు ధాన్యం రాశులను రోడ్లపై పరిచి ఆరబెట్టుకునే పనిలో ఉన్నారు. మచిలీపట్నం– విజయవాడ జాతీయ రహదారి అయినా.. మండలంలోని అంతర్గత రహదారుల్లో రైతులు ధాన్యం ఆరబెట్టుకుంటున్న దృశ్యాలే మనకు కనిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి వాతావరణం మారి మేఘావృతమై ఉండటంతో చివరి ఘట్టంలో ఉన్న వరి పంట ఏమవుతుందోనని రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. దీనికితోడు కూలీల కొరత కారణంగా ఇప్పటికిప్పుడు ధాన్యం మిల్లులకు తోలే అవకాశం లేకపోవడం వారిని మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. సెలవు రోజు కావడంతో అధికారులు అందుబాటులో లేకుండా పోయారు. దీంతో పంట సురక్షితంగా మిల్లులకు చేరే వరకు తమ పట్ల కనికరించమని ప్రకృతిని ప్రార్థిస్తున్నారు.

ప్రయాణికుల విశ్రాంతిశాల పునఃప్రారంభం



పెడన: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రయాణికుల విశ్రాంతి శాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం సాయంత్రం పునఃప్రారంభించారు. పడమట రామచంద్రరావు జ్ఞాపకార్థం 1983లో ఈ విశ్రాంతి శాలను నిర్మించారు. అనంతర కాలంలో శిథిలమవటంతో పెద్దలను గౌరవించేలా గౌడ సంఘం వారు విశ్రాంతిశాలను పునఃనిర్మిండం అభినందనీయమని పెడన ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్, బాబూలాల్, మట్టా శివ పావని, టీడీపీ నాయకులు యక్కల శ్యామలరావు, శెలపాటి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, గౌడ సంఘం అధ్యక్షుడు పడమట బలరామ్, సంఘ సభ్యులు, పెద్దలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

హంసలదీవి తీరంలో పర్యాటకుల సందడి

వసతులు లేక తప్పని ఇక్కట్లు



కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి వచ్చి సందడి చేశారు. యువత తీరం వెంట బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు ఇసుకతిన్నెల వెంట తమ పేర్లు రాసుకొని మురిసిపోయారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు పర్యాటకులకు సూచనలిస్తూ అవగాహన కల్పించారు. సముద్రంలో లోతుకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండలని సూచించారు. అయితే తీరానికి వచ్చే భక్తులకు వసతులు లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అటవీ అధికారులు టోల్ వసూలు చేస్తూ తమను దోపిడి చేస్తున్నారే గాని వసతుల కల్పనపై దృష్టి పెట్టలేదని పర్యాటకులు వాపోయారు. వసతులు లేకుండా వాహనాలకు, మనుషులకు టోల్ ఎందుకు చెల్లించాలంటూ పలువురు పర్యాటకులు అటవీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు



గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్‌లోని రవి డెంటల్ సెంటర్ వైద్యుడు డాక్టర్ మలిరెడ్డి రవి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దంత సేవలు అందించినట్లు రోటరీ క్లబ్ గుడివాడ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తెలిపారు. గతంలో ప్రణవాశ్రమ విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఐదుగురికి చికిత్సలు అవసరమయ్యాయని వారికి ఈ డెంటల్ సెంటర్‌లో రూ. 10వేలు విలువ గల వైద్యాన్ని ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. పాస్ట్ ప్రెసిడెంట్ రావి శ్రీహర్ష, క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, కార్యవర్గ సభ్యులు జి.నరేష్, ఎన్. వరప్రసాద్, బి.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మాలల జేఏసీ సమావేశం

గుడివాడ టౌన్: మాలమహానాడు, మాల ఉపకులాలు వర్గీకరణ వ్యతిరేకవాదుల జేఏసీ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజేంద్ర నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం ఐదు గంటలకు ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15వ తేదీన గుంటూరు నల్లపాడురోడ్ హౌసింగ్ కాలనీలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని కోరారు.